క్లుప్తంగా

ఘనంగా లంక తల్లమ్మ జాతర


లంక తల్లమ్మ అమ్మవారు

ముమ్మిడివరం: మండల ప్రజల ఇలవేల్పు ముమ్మిడివరం లంక తల్లమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత 15 రోజులుగా వివిధ వ్యాపార, వర్తక, కార్మిక సంఘాలు వంతుల వారీగా అమ్మవారి సంబరాలు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వైభవపేతంగా నిర్వహించారు. తీర్థ మహోత్సవాల్లో మండల ప్రజలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, బొంతు సత్యశ్రీనివాస్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారిలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా గ్రామదేవత జాతర


ఆదిలక్ష్మి అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెంలో ఉన్న ఆదిలక్ష్మి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి, నైవేద్యాలు చెల్లించారు. అనంతరం గ్రామోత్సవం జరిపి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నదానానికి విరాళాలు


అన్నదానానికి విరాళం అందజేస్తున్న దాతలు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేశారు. మంగళవారం భక్తులు విత్తనాల సుష్మప్రియ రూ.10 వేలు, ఇవటూరి కుమార వెంకట సత్యసాయి శ్రీనివాస్ రూ.5 వేలు ఆలయ సిబ్బందికి అన్నదానం నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వచ్చే నెల 7 నుంచి స్కూల్స్ ప్రారంభం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం ఆదేశాల మేరకు యానాంతో పాటు పుదుచ్చేరి, కారైకల్, మాహే రీజియన్‌లలో సైతం అప్పుడే పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని చెప్పారు. దీనిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


భీమనపల్లిలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లిలో సహకార సంఘం అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విలసవిల్లి, భీమనపల్లి, నంగవరం గ్రామాలకు చెందిన 75 మందికి వైద్య పరీక్షలు చేసి 65 మందికి కళ్లజోడు అవసరమని గుర్తించారు. వారిలో నలుగురికి ఏలూరు ఆశ్రమ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయించనున్నట్లు సత్తిరాజు తెలిపారు.

సర్టిఫికెట్‌ల జారీలో ఆలస్యంపై ఫిర్యాదు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సంబంధిత రెవెన్యూ శాఖ ఆలస్యంగా స్పందిస్తుందని యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత్‌రైట్స్ ప్రొటెక్షన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌ఏఓ మునిస్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మెల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కొత్తగా వివిధ కోర్సుల్లో చేరుతున్నవారు, సెంటాక్‌కు దరఖాస్తు చేసుకోవడానికి కులధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం స్థానిక సబ్ తాలూకా ఆఫీసులో వందలాది మంది కాళ్లరిగేలా తిరుగుతున్నారని చెప్పారు. దరఖాస్తులకు ఏవొక కొర్రీలు వేస్తూ సర్టిఫికెట్‌ల జారీని ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందించినవారిలో నబ్బుతి శ్రీనివాసరావు, లోకేశ్వరరావు, భీమారావు తదితరులున్నారు.

అభివృద్ధికి రాచబాట

- రూ.9.90 కోట్లతో ఏటిగట్టు రహదారి అభివృద్ధి
- సుమారు 30,000 మందికి ప్రయోజనం


ఆధునీకరించిన చింతపల్లిలంక-పల్లంకుర్రు ఏటిగట్టు రోడ్డు

ముమ్మిడివరం: ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లోని పలు మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ప్రజలు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడ చేరుకోవాలన్నా, రైతులు పంట దిగుబడులు రవాణా చేయాలన్నా తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. ఆఖరికి వైద్య సేవల కోసం కాకినాడ చేరుకోవాలన్నా సరే సరైన రహదారి లేక సుమారు 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి వచ్చేది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బొబ్బర్లంక నుంచి పల్లంకుర్రు వరకూ గౌతమీ గోదావరి కుడి ఏటిగట్టును ఎత్తు, వెడల్పు పెంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.240 కోట్ల నిధులు సమకూర్చడంతో పనులు చేపట్టారు. అయితే మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆ పనులు మరుగునపడిపోవడమే కాదు గత టీడీపీ ప్రభుత్వంలో ఆ నిధులను సైతం దారి మళ్లించేశారు. టీడీపీ ప్రభుత్వం సరిగ్గా ఎన్నికల ముందు కుడి ఏటిగట్టు చింతపల్లిలంక నుంచి పల్లంకుర్రు వరకూ సుమారు 12 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.9.90 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అయితే నిధుల లేమితో పనులు ముందుకు సాగలేదు.

ఎమ్మెల్యే పొన్నాడ చొరవతో

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ రహదారి ఆధునీకరణ, అభివృద్ధిపై చొరవ తీసుకుని నిధులు సమకూర్చి కాంట్రాక్టర్‌ను ఒప్పించి పనులు ప్రారంభింపజేశారు. ముమ్మిడివరం మండలం చింతపల్లిలంక నుంచి కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వరకూ సుమారు 12 కిలోమీటర్ల మేర రూ.9.90 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణ ఇక్కట్లు తొలగిపోయాయి. తీర గ్రామాల ప్రజలు 216 జాతీయ రహదారి చేరుకునేందుకు రవాణా సౌకర్యం ఏర్పడింది. కాట్రేనికోన మండల ప్రజలు పల్లంకుర్రు, అయినాపురం, కొత్తలంక, కత్రివానిరేవు, గాడిలంక మీదుగా మురమళ్ల 216 జాతీయ రహదారి చేరుకొనేందుకు మార్గం సుగమమైంది. మత్స్యకారులు మత్స్య సంపదను మార్కెట్ ప్రాంతానికి తరలించేందుకు వీలు కలిగింది. సుమారు 30 వేల మందికి ఈ రహదారి ఉపయోగకరంగా ఉంది. 15 మారుమూల, తీర గ్రామాల అభివృద్ధికి దోహదపడుతోంది.

మార్గం సుగమమైంది



గతంలో కాట్రేనికోన మండల ప్రజలు మహిపాల చెరువు, ముమ్మిడివరం మీదుగా మురమళ్ల చేరుకొనేవాళ్లం. ప్రస్తుతం మండలంలోని పల్లంకుర్రు నుంచి అయినాపురం, కొత్తలంక, కత్రివానిరేవు మీదుగా మురమళ్ల 216 జాతీయ రహదారికి చేరుకొనేందుకు ఏటిగట్టు రహదారి ఎంతో ఉపయోగపడుతుంది. సుమారు 15 కిలోమీటర్ల దూరం కలిసొచ్చింది.

– కాత్రు అప్పారావు, అయినాపురం

రవాణా సౌకర్యం ఏర్పడింది



వ్యవసాయ, మత్స్యకార ఉత్పత్తులు తరలించేందుకు గతంలో రవాణా సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు రహదారిని ఆధునీకరించడంతో లారీలు, ఇతర వాహనాల ద్వారా వ్యవసాయ, మత్స్యకార ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించే వీలు కలుగుతుంది.

– బొర్రా విష్ణు, అయినాపురం

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

యానాం: నియోజకవర్గ శివారు తీరప్రాంత గ్రామమైన గిరియాంపేటలోని స్థానిక పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఈ నెల 31 బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 2న దరియాలతిప్ప కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో, 4న కనకాలపేట కేపీవీఎస్ ప్రభుత్వ హైస్కూల్‌లో వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా శిబిరాలకు ఓఎన్‌జీసీ ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ కాకినాడ, ఇనోదయ ఆసుపత్రి, లయన్స్‌క్లబ్ పిల్లారాయ యానాం తదితరులు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

జగనన్న పాల వెల్లువతో స్వచ్ఛమైన పాల సేకరణ


జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్

అల్లవరం: జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో స్వచ్ఛమైన పాల సేకరణ చేయడమే లక్ష్యమని తహసీల్దార్ సాంబశివ ప్రసాద్ అన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా బోడసకుర్రు, అల్లవరం సచివాలయాల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు మంగళవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సీహెచ్ నారాయణరావు మొబైల్ యాప్ ద్వారా పశువులను గుర్తించి, అమూల్ డైరీకి పాలు వేయడం, మహిళల్లో సహకార స్ఫూర్తిని పెంపొందించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఏపీఎం సయ్యద్ ఏఓ లక్ష్మణరావు, కార్యదర్శులు రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ మెడికల్, డెంటల్ కోర్సులకు నోటిఫికేషన్

యానాం: 2023–24 విద్యాసంవత్సరానికి గాను మెడికల్, డెంటల్ కోర్సుల్లో చేరేందుకు సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ(సెంటాక్) పుదుచ్చేరి మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. నీట్ పీజీలో అర్హత సాధించిన అభ్యర్థులు పుదుచ్చేరిలోని ప్రభుత్వ, సెల్ఫ్ ఫైనాన్సింగ్ మెడికల్ కాలేజీల్లో ప్రథమ సంవత్సరం మెడికల్, డెంటల్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల వివరాల కోసం 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్' వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 30 నుంచి స్వీకరిస్తారని, వచ్చే నెల 13వ తేదీలోగా దరఖాస్తులు చేరాలని సెంటాక్ కన్వీనర్ తెలిపారు.

జగనన్నది ప్రజారంజక పాలన

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- పార్టీ నేతలతో కలిసి నాలుగేళ్ల సంబరాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్


ముమ్మిడివరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని, జగనన్న ఏదైనా సరే చెప్పారంటే కచ్చితంగా చేసి చూపిస్తారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా భట్లపాలెంలోని మంత్రి నివాసంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ కులం చూడం.. మతం చూడం.. పార్టీ చూడం.. ప్రాంతం చూడం.. అర్హతే ప్రామాణికం.. అన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన మాటలను తూచా తప్పకుండా పాటించి ప్రజలందరికీ సంక్షేమ పాలన అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, షేక్ అబ్దుల్ ఖాదర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, కరేళ్ల రమేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు సంసాని నాని, కొనుకు బాపూజీ, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపి, కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మరో రూ.90 వేల కోట్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో నవరత్న పథకాల ద్వారా రూ.2.10 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారని, రానున్న ఏడాదిలో మరో రూ.90 వేల కోట్లు ఇవ్వనున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. భట్లపాలెంలో మంగళవారం సాయంత్రం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి హామీలను 98.5 శాతం అమలు చేశారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి 10 హామీలు కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. జగన్ ప్రభుత్వానికి ముందస్తు ఎన్నికలకు వెళ్ళే ఆలోచన లేదని మంత్రి విశ్వరూప్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళ అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి, కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, పినిపే శ్రీకాంత్, బొంతు గోవిందశెట్టి, బద్రి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికారం పగటి కలే

ముమ్మిడివరం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు అధికారం పగటి కలగానే మిగిలిపోతుందని, మరో 30 ఏళ్ల పాటు రాష్ట్రానికి సీఎంగా జగన్ మాత్రమే ఉండాలన్నది ప్రజలందరి అభిమతమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక పోలమ్మ చెరువు వద్ద ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు విగ్రహానికి ఎమ్మెల్యే పొన్నాడతో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ శకం ముగిసిందన్నారు. 2024 ఎన్నికల తర్వాత ప్రజలే ఆ పార్టీని భూస్థాపితం చేస్తారని చెప్పారు. ఎన్నికల ముందు లెక్కలేనన్ని హామీలు గుప్పించడం, ఆ తర్వాత వాటిని తుంగలో తొక్కడం బాబుకు వెన్నతో పెట్టిన విద్యగా మారిందన్నారు. మహానాడులో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలన్నీ ఉత్త బూటకమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగా భవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, కోన శ్రీనివాసరావు, వరసాల రమాదేవి, మట్టపర్తి సత్యనారాయణ, రెడ్డి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుంది

అల్లవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోమారు ప్రభంజనం సృష్టించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా పదవిని అలంకరించనున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం అల్లవరం మండలం గోడిలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దేశానికే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని తెలిపారు. గూడు లేని 32 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, జల్లి ఏడుకొండలు, రేవు శ్రీనివాసరావు, నవుండ్రు రమేష్, ఉందుర్తి ప్రసాద్, ఈతకోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ


బలుసుతిప్పలో బోటుపై నిర్వహిస్తున్న పర్యావరణ హిత జీవనశైలి అవగాహన ర్యాలీ


గొల్లవిల్లిలో పర్యావరణ హిత జీవనశైలి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి

కాట్రేనికోన: పర్యావరణ పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యమని జిల్లా అటవీశాఖాధికారి ఎంవీ ప్రసాదరావు అన్నారు. బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్పలో అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమాన్ని సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, మొక్కలు పెంచడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ నుంచి రక్షణ పొందగలమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తుఫాన్లు, సునామీలు వంటి పెను ఉపద్రవాల నుంచి తీరప్రాంత ప్రజలకు మడ అడవులు రక్షణ కలిగిస్తున్నాయన్నారు. సర్పంచ్ ఏడుకొండలు మాట్లాడుతూ మడ అడవుల పరిరక్షణ మనందరి బాధ్యతని చెప్పారు. అనంతరం గోదావరి పాయలో బోటులపై ఫ్లెక్సీలను, జెండాలను ఎగురవేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాడి ఆదినారాయణ, తిరుమాని సత్తిబాబు, ఓలేటి సతీష్, బర్రే రాంబాబు, ఇసుకపట్ల శ్రీనుబాబు, సంగాని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవన శైలి ప్రతిజ్ఞ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రులో కాశి చెరువు వద్ద ఉపాధి కూలీలు చేస్తున్న పూడికతీత పనులను ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి మంగళవారం పరిశీలించారు. అనంతరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీవో వి.రాజామణితో కలిసి కూలీలచే పర్యావరణహిత జీవన శైలి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీఏ ఎం.దేవిపార్వతి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే సేంద్రియ ఎరువును తయారుచేద్దాం

అమలాపురం టౌన్: ఇంటి వద్దే తడి, పొడి చెత్తలను విభజించి తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారుచేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదామని పట్టణంలోని వార్డు సచివాలయ పర్యావరణ కార్యదర్శులు ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్ ప్రజలకు మంగళవారం సాయంత్రం కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన కల్పించారు. 'మిషన్ లైఫ్– లైఫ్ స్టయిల్ ఆఫ్ ఎన్విరాల్‌మెంట్' అనే అంశంపై పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. పొడి చెత్త నుంచి వచ్చే ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలతో నేల అవసరం లేకుండా ఇంటి వద్దే మొక్కలు పెంచే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ పర్యావరణ కార్యదర్శులు చింతా నాగేంద్ర ప్రసాద్, ఎం.భార్గవి, బండి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

దొమ్మేటి మృతి తీరని లోటు


దొమ్మేటి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ, ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: ఒకప్పటి తాళ్లరేవు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు ఆకస్మిక మృతి తీరని లోటని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణతో కలిసి కాకినాడ గైగోలుపాడులో దొమ్మేటి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ దొమ్మేటి తన పరిపాలనా కాలంలో పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఆయన వెంట కాశి లక్ష్మణస్వామి, పేర్ని ఆదినారాయణ మూర్తి, రెడ్డి సతీష్, బొంతు మోహన్ తదితరులున్నారు.

అమలాపురంలో...

అమలాపురం టౌన్: మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు మృతికి అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలియజేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు తదితరులు స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో దొమ్మేటి చేసిన సేవలను కొనియాడారు.

జార్జిపేటలో గాలివాన బీభత్సం


జార్జిపేటలో పిడుగుపడి దగ్ధమవుతున్న కొబ్బరిచెట్టు


ఎంఎల్‌కె నగర్‌లో ఆటో రిక్షాపై కూలిన కొబ్బరి చెట్టు


రాజీవ్ బీచ్ దారిలో వేళ్లతో సహా నేలకొరిగిన చెట్టు

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేటలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడి అది దగ్ధమవ్వడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో చెట్టు సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మరోవైపు స్థానికంగా ఈదురుగాలుల ధాటికి స్థానిక ఎంఎల్‌కె నగర్‌లో కొబ్బరిచెట్టు విరిగి పడడంతో అక్కడే ఉన్న ఓ రిక్షా పాక్షికంగా ధ్వంసమైంది. సుమారు గంట పాటు వర్షం పడడంతో స్థానిక రహదారులన్నీ చెరువులను తలపించాయి. ముఖ్యంగా స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

యానాంలో...

యానాం: యానాంలో మంగళవారం భారీ వర్షానికి తోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి స్థానిక రాజీవ్ బీచ్ వద్ద భారీ చెట్టు నేలకొరిగింది. గాలులు బీభత్సం సృష్టించడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీవర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ పతాకాన్ని పెట్టా శివప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నక్కా అరుణకుమార్, సురేష్, రమేష్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: యానాం సీఐటీయూ శాఖ ఆధ్వర్యంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ యానాం కమిటీ కన్వీనర్ కుంచే సత్యనారాయణ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సీఐటీయూ 1970 నుంచి కార్మికులకు సేవలందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తిరుకోటి శ్రీనివాసరావు, పెయ్యల వెంకటేశ్వరరావు, నలాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.